సాక్షి ఆదిలాబాద్

మంగళవారం : 2 : జూలై : 2024

ఆన్‌లైన్‌లో టాలెంట్ హంట్



విజ్ఞానభారతి, విజ్ఞాన ప్రసాద్, ఎన్‌సీఈఆర్టీ సంయుక్తంగా 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' పేరిట ఏటా ఆన్‌లైన్ వేదికగా ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

8లో▸

7న ఎమ్మార్పీఎస్ సభ

ఎదులాపురం: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 7న రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న సభను జయప్రదం చేయాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కదరవు ప్రవీణ్ కోరారు. సమితి నాయకులతో కలిసి జిల్లా కేంద్రంలో సోమవారం సభ కు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఇందులో నాయకులు రమేశ్, పెంటన్న, గంగన్న, శ్రీనివాస్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

15న ధర్నా విజయవంతం చేయాలి

ఎదులాపురం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలుపరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్‌లోని కార్మికశాఖ కమిషనరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నా విజయవంతం చేయాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా ప్ర దాన కార్యదర్శి గాజంగుల రాజు కోరారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నా రు. కార్మికశాఖలోని ఖాళీ పోస్టులు భర్తీ చేయడంతో పాటు కార్మికుల ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారం దిశగా ఈ నెల 15న చేపడుతున్న ధర్నాలో భవన నిర్మాణ రంగ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఇందులో సంఘం నాయకులు రమేశ్, భీంరావు, కుమార్, ఎస్‌కే నూర్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపిక కోసం ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ప్రింట్ కాపీలను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. మున్సిపల్ స్టాఫ్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదిలాబాద్ మున్సిపల్ కార్మికులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలను హైదరాబాద్‌లోని ప్రజాదర్బార్ వేదికగా సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఇందులో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, ఉపాధ్యక్షులు శ్రీను, ఊషన్న, సురేశ్, సహాయ కార్యదర్శులు అశోక్, పొచ్చిరాం, యాదగిరి పాల్గొన్నారు.

'కమ్యూనిస్టు పార్టీ బలంగా ఉంటేనే ప్రజలకు న్యాయం'

ఎదులాపురం: కమ్యూనిస్టు పార్టీ బలంగా ఉన్నప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఖమ్మం పట్టణంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు తీర్చలేకపోతున్నాయన్నారు. ఉచితంగా, నాణ్యంగా అందించాల్సిన విద్య, వైద్యం, నీటి సౌకర్యంపై దృష్టి సారించడం లేదన్నారు. ఇందులో పార్టీ జాతీయ నాయకులు అజీజ్ పాషా, డాక్టర్ నారాయణ, చాడ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ డెలివరీలో ఒంటికాలు జీన్స్



ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఒంటి కాలు పాత జీన్స్ ప్యాంట్ ఇదే..

ఆదిలాబాద్‌టౌన్: ఆన్‌లైన్ మోసాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇదివరకు ఓ వస్తువుకు బదులు వేరే వస్తువు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మావలకు చెందిన ఓ వినియోగదారుడు ఎలాంటి ఆర్డర్ ఇవ్వకపోయినా ఆ వ్యక్తి పేరిట సోమవారం పార్సిల్ వచ్చింది. అనుకోకుండా చేసి ఉంటానేమోనని దానికి సంబంధించిన బిల్లు రూ.414 చెల్లించి తీసుకున్నాడు. అయితే దాన్ని తెరిచి చూసే సరికి ఏడెనిమిది కవర్లలో ఒంటి కాలు పాత జీన్స్ ప్యాంట్ ప్యాకింగ్ చేసి ఉంది. దీన్ని చూసి ఒక్కసారిగా అవాక్కయ్యాడు.

కొత్త చట్టాలొచ్చినయ్





- సెక్షన్లు మారినయ్
- మావల పీఎస్‌లో తొలి కేసు
- నూతన నేర చట్టాలపై సిబ్బందికి శిక్షణ
- ఠాణాల వారీగా ప్రజలకు అవగాహన

పాత వాటి స్థానంలో కొత్త చట్టాలు..

పాత చట్టం	కొత్త చట్టం
భారత శిక్షా స్మృతి (ఐపీసీ)	భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్)
భారత సాక్ష్యాధారాల చట్టం	భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ)
భారత నేర శిక్షా స్మృతి (సీఆర్‌పీసీ)	భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)



సాక్షి,ఆదిలాబాద్: బ్రిటీష్ కాలం నాటి నేర న్యాయ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా కొత్తగా రూపొందించిన మూడు నేర న్యాయ చట్టాలు జూలై 1 నుంచి అమల్లోకి వచ్చేశాయి. జిల్లాలోని మావల పీఎస్‌లో తొలి కేసు నమోదైంది. జిల్లాలోని పోలీస్ సిబ్బందికి వీటిపై శిక్షణ దాదాపు పూర్తి చేసినట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. నూతన చట్టాలతో సత్వర న్యాయం అందే అవకాశముంటుందని చెబుతున్నారు.

మావలో తొలి కేసు..

మావల పోలీసు స్టేషన్ పరిధిలోని పాలిటెక్నిక్ కాలేజ్ గ్రౌండ్ సమీపంలో సోమవారం క్రాంతినగర్‌కు చెందిన ప్రైవేట్ టీచర్ ఎల్మావార్ నకుల్ రెడ్డి(36) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని తండ్రి భూమారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడి భార్య 15 రోజుల క్రితం పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మనస్తాపం చెందాడు. అప్పటికే మద్యానికి అలవాటుపడ్డ అతను దీని నుంచి తేరుకోలేక పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి పాత చట్టాల పరంగా సీఆర్‌పీసీ 174 సెక్షన్ కింద కేసు నమోదు చేసేవారు. కొత్త చట్టాలు అమల్లోకి రావడంతో బీఎన్ఎస్ఎస్ 194 సెక్షన్ కింద మావల పోలీసు స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదైంది. ఇక అసహజ మరణాలకు సంబంధించి బీఎన్ఎస్ఎస్ కింద నమోదు చేస్తారు. ఇతర కేసుల్లో ఇది వరకు ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యేవి. తాజాగా బీఎన్ఎస్ సెక్షన్ల కింద నమోదు షురూ అయింది.

అమల్లోకి..

భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ సాక్ష అధినియమ్ (బీఎస్ఏ), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) కొత్త చట్టాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించి జూలై 1నుంచి అమల్లోకి తెచ్చింది. ఇకపై జరిగే నేరాలకు సంబంధించి వీటిలోని సెక్షన్ల ఆధారంగానే కేసులు నమోదు కానున్నాయి. కొత్త చట్టాల రాకతో భారత శిక్షా స్మృతి (ఐపీసీ), భారత సాక్షాధారాల చట్టం, భారత నేర శిక్షా స్మృతి (సీఆర్‌పీసీ) కనుమరుగు కానున్నాయి. అయితే జూలై 1వ తేది కంటే ముందు ఏవైనా కేసులు జరిగినట్టు రిపోర్టులు వస్తే పాత సెక్షన్‌లోనే కేసు నమోదు చేస్తారు. నేరడిగొండ పీఎస్ పరిధిలో సోమవారం ఓ మిస్సింగ్ కేసు పోలీసుల దృష్టికి వచ్చింది. అయితే ఆదివారం నుంచి మిస్సింగ్ ఉండడంతో అది పాత సెక్షన్లలోనే నమోదు చేశారు.

కొత్త చట్టాల్లోని ప్రధాన అంశాలు..

కొత్త చట్టాలపై ప్రజలకు ఇంకా పూర్తిగా అవగాహన రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే కొన్ని అంశాలు పరిశీలిస్తే.. బాధితుడు ఇకపై నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండానే జరిగిన సంఘటనపై ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. పోలీసు స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఎవరైనా, ఎక్కడైనా ఫిర్యాదు చేసిన పక్షంలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. హేయమైన నేరాల్లో వీడియోగ్రఫీ తప్పనిసరి చేయనున్నారు. దీంతో దర్యాప్తులో నాణ్యత పెరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో దర్యాప్తు నిర్దేశిత గడువులోపు పూర్తి కావాలి. బాధిత మహిళలు, చిన్నారులకు ఉచితంగా ప్రాథమిక చికిత్స, వైద్య చికిత్స అందించాల్సి ఉంటుంది. సమన్లు ఇకపై నేరుగా వెళ్లి ఇవ్వాల్సిన పని లేదు. ఆన్‌లైన్‌లో పంపించవచ్చు. అత్యాచార కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీసులు నమోదు చేయాలి.

95 శాతం పోలీసులకు శిక్షణ..

కొత్త చట్టాలపై 95 శాతం పోలీసు సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేసినట్లు జిల్లా పోలీసు అధికారి చెబుతున్నారు. 11 బ్యాచుల్లో 535 మందికి ఈ శిక్షణ ఇచ్చారు. సీఐడీ తెలంగాణ నుంచి కూడా వచ్చిన వారు ఎస్‌వోపీ స్టాండింగ్ అంశాల్లో ఎలా వ్యవహరించాలనే దానిపై అవగాహన కలిగించారు. మొత్తంగా పోలీసు శాఖ నూతన చట్టాల పరంగా ముందుకు కదిలింది.

ఠాణా వారీగా అవగాహన

కొత్త చట్టాలకు సంబంధించి పోలీసు స్టేషన్ వారీగా ప్రజలకు అవగాహన కల్పించనున్నాం. ఇదివరకు చట్టాలు పనిష్మెంట్ లాగా ఉండేవి. కొత్త చట్టాలు న్యాయం చేకూరుస్తాయి. సిబ్బందికి శిక్షణ దాదాపుగా పూర్తయ్యింది.

– గౌస్ ఆలం, ఎస్పీ

ఎట్టకేలకు టీచర్ల బదిలీలు

- ఏళ్ల నిరీక్షణకు తెర
- జిల్లాలో 810 మందికి స్థానచలనం
- కొత్త స్థానాల్లో చేరిన ఉపాధ్యాయులు



ఆదిలాబాద్ ఎంఈవో జయశీల వద్ద రిపోర్టు చేస్తున్న ఉపాధ్యాయుడు

ఆదిలాబాద్‌టౌన్: కొన్నేళ్లుగా బదిలీల కోసం నిరీక్షిస్తున్న ఉపాధ్యాయులకు ఎట్టకేలకు తీపి కబురు అందింది. వారం రోజులుగా టీచర్ల బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. రెండు రోజుల క్రితం వెబ్ ఆప్షన్లు ఇచ్చి దరఖాస్తు చేసుకున్న వారికి సోమవారం స్థానచలనం కలిగింది. చివరిసారిగా 2018లో ఉపాధ్యాయ బదిలీలు జరిగాయి. కాగా గతేడాది సెప్టెంబర్‌లో బదిలీల ప్రక్రియ చేపట్టినప్పటికీ కోర్టు కేసు కారణంగా ఎస్జీటీలు, భాషా పండితులు, పీఈటీల ట్రాన్స్‌ఫర్లు నిలిచిపోయాయి. ఇటీవల ప్రభుత్వం మళ్లీ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టడంతో ఈ ప్రక్రియ ముగిసింది. దూర ప్రాంతాల్లో ఉంటూ ఇబ్బందులకు గురైన ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగింది. జిల్లాలో బదిలీలకు సంబంధించి మొత్తం 998 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎస్జీటీలకు సంబంధించి 977 మంది ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోగా, 792 మంది ఉపాధ్యాయులకు బదిలీలయ్యాయి. అలాగే 14 మంది భాషా పండితులకు, నలుగురు పీఈటీలకు బదిలీలు జరిగాయి. కాగా జిల్లాలో మొత్తం 810 మందికి స్థానచలనం జరిగింది. వీరు ఆయా మండలాల ఎంఈవోల కార్యాలయంలో విధుల్లో చేరారు. పాత పాఠశాలల నుంచి రిలీవ్ అయి కొత్త పాఠశాలలకు వెళ్లారు. ఇదిలా ఉండగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్న చోట బదిలీ అయిన ఉపాధ్యాయులకు రిలీవర్ వచ్చేవరకు రిలీవ్ చేయవద్దని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వీరు బదిలీ అయినప్పటికీ పాత స్థానంలోనే విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, వలభోజు గోపీకృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు. రేషనలైజేషన్ పేరుతో అదే పాఠశాలలో కొనసాగించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే బదిలీల్లో అంతర్గత రేషనలైజేషన్ పాటించి ఉపాధ్యాయ పోస్టులు తగ్గించి చూపించారని పేర్కొన్నారు.

'సాత్నాల'లో మాక్ డ్రిల్



సాత్నాలలో మాక్ డ్రిల్‌లో పాల్గొన్న ఎస్పీ గౌస్ ఆలం తదితరులు

జైనథ్: మండలంలోని సాత్నాల ప్రాజెక్టులో ఎస్పీ గౌస్ ఆలం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మాక్ డ్రిల్ నిర్వహించారు. విపత్తు నిర్వహణ బృందం సభ్యులతో కలిసి ప్రాజెక్టులో ఎస్పీ, ఇతర పోలీస్ సిబ్బంది బోట్‌పై పర్యటించారు. వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందులో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్, 20మంది శిక్షణ తీసుకున్న సిబ్బందితో కలిసి విపత్తు నిర్వహణ బృందాన్ని ఏర్పా టు చేసినట్లు చెప్పారు. విపత్కర పరిస్థితుల్లో పని చేసేందుకు వీరంతా సిద్ధంగా ఉంటారన్నారు. ఇందులో జైనథ్ ఎస్సై పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

కనిపించే దైవం.. వైద్యులు



కేక్ కట్ చేస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్
- ఘనంగా డాక్టర్స్ డే

ఆదిలాబాద్‌టౌన్: వైద్యులను రోగులు కనిపించే దైవంగా భావిస్తారని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్ ఆడిటోరియంలో డాక్టర్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఐఎంఏ, బెస్ట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు రక్తదానం చేశారు. రిమ్స్ డైరెక్టర్ కేక్ కట్ చేసి మాట్లాడారు. పేదలకు నాణ్యమైన వైద్యసేవలందించే బాధ్యత వైద్యులపై ఉంటుందన్నారు. అనంతరం వైద్యులను సన్మానించారు. ఇందులో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, వైద్యులు శ్యాంప్రసాద్, సుమలత, రమ, శిరీష్, తానాజీ పాల్గొన్నారు.

'జర్నలిస్టులను బెదిరించడం సరికాదు'

ఆదిలాబాద్‌టౌన్: జర్నలిస్టులను అధికార కాంగ్రెస్‌కు చెందిన కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇది సరికాదని జర్నలిస్టు జేఏసీ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రానికి విచ్చేసిన మంత్రి సీతక్కను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ పరాజయంపై విశ్లేషణాత్మక కథనం ఇచ్చిన ఓ ఛానల్ జర్నలిస్టును అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు బెదిరించడమే కాకుండా ఇతరులతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించే యత్నం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక వార్తలు రాశారనే కారణంగా మరో ఇద్దరు విలేకరులను పోలీసు స్టేషన్‌కు పిలిపించారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్ దేవేందర్, కోకన్వీనర్ వెంకటేశ్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

మత్తడివాగుకు జలకళ



తాంసి: ఇటీవల కురుస్తున్న వర్షాలతో తాంసి మండలం వడ్డాడి వద్ద గల మత్తడివాగు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. వేసవిలో డెడ్‌స్టోరేజీకి చేరిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం జలకళ సంతరించుకుంటుంది. ఆదివారం 168 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా ప్రస్తుతం 274.20 మీటర్లకు చేరినట్లు ఏఈ హరీశ్‌కుమార్ తెలిపారు.

ఏసీ గదుల్లో కాదు.. క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- విధి నిర్వహణలో మార్కు ఉండేలా పనిచేయాలి
- అధికారులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యేలు శంకర్, బొజ్జు

కైలాస్‌నగర్: అధికారులు కార్యాలయాల్లో ఏసీ గదులకే పరిమితం కాకుండా వారంలో రెండు రోజులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని, అప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జుతో కలిసి అధికారులతో సోమవారం జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై శాఖల వారీగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వర్షాలు భారీగా కురిస్తే వరదలు, విష జ్వరాలు, పారిశుధ్య సమస్య తలెత్తే అవకాశముందన్నారు. ఈమేరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధానంగా వసతిగృహాలు, పాఠశాలల్లో సమస్యలను పరిష్కరిస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అధికారులు బాధ్యతతో పనిచేయాలని, వృత్తికి న్యాయం చేసినప్పుడే సంతోషం కలుగుతుందన్నారు. నల్గొండలో పదవీ విరమణ పొందిన ఓ టీచర్‌ను వాహనంలో ఉంచి స్టూడెంట్స్ మూడు కిలోమీటర్లు లాగి తమ కృతజ్ఞత చాటారని గుర్తు చేశారు. అధికారులు అంకితభావంతో సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజల్లో అలాంటి గుర్తింపు పొందాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ జిల్లా అభివృద్ధికి పాటుపడాలన్నారు. సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు పలువురు దివ్యాంగులకు జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంజూరు చేసిన మూడు చక్రాల వాహనాలు, వీల్ చైర్స్‌ను మంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

వన మహోత్సవానికి శ్రీకారం



మొక్క నాటుతున్న మంత్రి సీతక్క

అంతకు ముందు పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. మావల అటవీ ప్రాంతంలోని అర్బన్ పార్కులో ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు. సఫారీలో తిరుగుతూ, వాచ్ టవర్‌పైకెక్కి బైనాక్యులర్‌తో పార్కులోని పచ్చదనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తడోబా, కండువ వంటి పార్కుల మాదిరిగా 1500 ఎకరాల్లో అర్బన్ పార్కు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పచ్చదనం పెంచేలా విరివిగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని ప్రజలకు సూచించారు.

'డీడీఆర్ఎఫ్' ఏర్పాటు అభినందనీయం



రెస్క్యూ బోట్‌ను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

కైలాస్‌నగర్: జిల్లాలో వరదలు, అగ్ని, రోడ్డు ప్రమాదాలు వంటి ఆపత్కాల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా వెంటనే స్పందించేలా ఎన్‌డీఎఫ్, ఎస్‌డీఎఫ్ తరహాలో జిల్లాలో డీడీఆర్ఎఫ్ (డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్)ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 20 మంది యువ పోలీసులతో జిల్లా విపత్తు నిర్వహణ బృందంగా ఏర్పాటు చేయగా.. వీరంతా హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్మెంట్ ద్వారా వారం పాటు శిక్షణ పొందారు. జిల్లాలో విపత్తులు సంభవించినప్పుడు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్న ఈ బృందంతో పాటు అత్యాధునిక పరికరాలను స్థానిక మావల అర్బన్ పార్కులో రాష్ట్ర మంత్రి సీతక్క సోమవారం ప్రారంభించారు. రెస్క్యూటీంకు అందజేసిన రెస్క్యూబోట్, మోటార్ మిషన్స్, మెడికల్ స్ట్రెచర్స్, లైఫ్ జాకెట్స్, వుడ్ కట్టర్ మిషన్స్ వంటి అత్యాధునిక పరికరాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆపత్కాల సమయాల్లో ప్రాణనష్టం కాకుండా జిల్లాలో సొంతంగా పోలీస్‌శాఖ ద్వారా డీడీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పరిస్థితులను అంచనా వేసుకుంటూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ఎదులాపురం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ బాధ్యులు సోమవారం వినతి పత్రం సమర్పించారు. జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రిని స్థానికంగా కలిసి సమస్యలు విన్నవించారు. ఇందులో యూనియన్ బాధ్యులు రాధ, సునంద, వసంత, సునీత తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని..

ఉట్నూర్‌రూరల్: గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరుతూ టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి వచ్చిన మంత్రి సీతక్కకు సోమవారం వినతి పత్రం అందించారు. ఇందులో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్ రావు తదితరులున్నారు.

క్లుప్తంగా

దొంగిలించిన వెండి రికవరీ



రికవరీ చేసిన వెండి పట్టీలు

ఆదిలాబాద్‌టౌన్: బంగారం షాపులో వెండి పట్టీలు దొంగిలించిన మహిళ నుంచి రికవరీ చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. గతనెల 21న పట్టణంలోని వంశీకృష్ణకు చెందిన బంగారు దుకాణంలో ఆభరణాలు కొనుగోలు చేసేందుకు వెళ్లిన మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లా దేగామకు చెందిన ఉషాబాయి దగ్గు కేజీ వెండీ పట్టీలను దొంగిలించి ఆతర్వాత పరారయ్యింది. బాధితుడు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మరోసారి దొంగతనం చేసేందుకు జిల్లా కేంద్రానికి వచ్చిన ఆమె రైల్వే స్టేషన్‌లో పోలీసులకు కనిపించడంతో సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, వన్‌టౌన్ ఎస్సై ఉదయ్ కుమార్, హెడ్‌కానిస్టేబుల్ రాధ, కానిస్టేబుల్ పుష్ప, సీసీఎస్ పోలీసులు జాకీర్, రాహత్, శ్రీనివాస్ అరెస్టు చేశారు.

శివాలయంలో చోరీ

లోకేశ్వరం: మండల కేంద్రంలోని శివాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఏఎస్సై దిగంబర్ తెలిపారు. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోని హుండీని పగులగొట్టి అందులోని నగదు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఆలయంలోని సీసీ పుటేజీలను పరిశీలించిన పోలీసులు దుండగులు వెనుకనుంచి మాస్కులు ధరించి ఆలయంలో ప్రవేశించారన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఏఎస్సై తెలిపారు.

ఆదిలాబాద్ ఆస్పత్రిలో..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గజానన్ ఆస్పత్రిలో ఈనెల 29న ఆదిలాబాద్‌కు చెందిన సమీర్, అయాన్ చోరీకి పాల్పడ్డారని టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి సంబంధించి సెల్‌ఫోన్, అక్కడ పనిచేసే మహిళా సిబ్బందికి సంబంధించి రూ.1500 నగదును దొంగిలించారు. ఆస్పత్రి సిబ్బంది సుదర్శన్ టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా ఈ ఇద్దరు దుండగులు రాత్రి చోరీకి పాల్పడిన అనంతరం జైనథ్ మండలంలోని తరోడా ఆలయంలో సైతం చోరీకి పాల్పడి పోలీసులకు పట్టుబడ్డారు. ప్రస్తుతం వారు జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నట్లు వివరించారు.

యువతి అదృశ్యం

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మంత్రి అర్చన (22) సోమవారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో యువతి తల్లి మంత్రి కవిత సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

ఆహ్లాదం పంచుతున్న విజ్ఞాన కేంద్రం




రాళ్లపై చెక్కిన వడ్రంగి పిట్ట, ఊసరవెల్లి బొమ్మలు

వెదురుతో చేసిన సీలింగ్



గోడలపై వన్యప్రాణుల చిత్రాలు




మావలలోని హరితవనం పార్క్ చూపరులను మైమరిపిస్తోంది. ఇక్కడ అధికారులు పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో పైకప్పును వెదురు బొంగులతో సీలింగ్ ఏర్పాటు చేసి గోడలపై గీసిన అటవీ జంతువుల బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. బండరాళ్లపై వడ్రంగి పిట్ట, ఊసరవెల్లితో పాటు వివిధ రకాల జంతువుల బొమ్మలను చెక్కారు. కలప మొద్దును ప్రదర్శనకు పెట్టారు. దీని ప్రత్యేకత ఎత్తు 15 మీటర్లు, వెడల్పు 2.10 మీటర్లు ఉండడం.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



మావల హరితవనంలో ఏర్పాటు చేసిన పర్యావరణ విజ్ఞాన కేంద్రం



ప్రదర్శనకు ఉంచిన కలప దుంగ

ఆన్‌లైన్‌లో టాలెంట్ హంట్

- 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' పేరిట ప్రతిభాన్వేషణ పరీక్ష
- విద్యార్థుల్లో పరిశోధనాభిరుచికి పదును
- కేంద్ర ప్రభుత్వ విద్యావనరులశాఖ తోడ్పాటు
- మొదలైన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులు కేవలం బట్టీ అభ్యసనానికి ప్రాధాన్యమివ్వకుండా వారిలో పరిశోధనాభిరుచిని పెంపొందింపజేసేలా ప్రయోగ రంగాలు, ఆవిష్కరణల వైపు దృష్టి సారించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు పరుస్తోంది. ఇందులో భాగంగానే విజ్ఞాన భారతి, విజ్ఞాన ప్రసాద్, ఎన్సీఈఆర్టీ (నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్) సంయుక్తంగా 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' పేరిట ఏటా ఆన్‌లైన్ వేదికగా ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 2024–25విద్యా సంవత్సరానికి గానూ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఆరోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు లక్షన్నరకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

పరిశోధనాభిరుచి పెంపొందించేలా..

దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరోతరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్‌లో 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' పేరిట ఏటా ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న పరిశోధనల కృషిని విద్యార్థులకు తెలియజేయడంతో పాటు వారిలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఈ ప్రక్రియ దోహదపడనుంది. ఇప్పటికే ఇన్‌స్పైర్, ఇన్నోవేషన్ ఛాలెంజ్, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తుండగా తాజాగా జాతీయస్థాయిలో వీవీఎం పరీక్షను కూడా నిర్వహిస్తున్నారు.

ప్రక్రియ ఇలా...

పాఠశాల స్థాయిలో జిల్లాలో 6 నుంచి 11వ తరగతిలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులు ప్రతీ తరగతికి ముగ్గురు చొప్పున మొత్తం 18 మందిని ఎంపిక చేసి మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో 120 మంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలు, జ్ఞాపిక, ధ్రువీకరణపత్రం అందజేస్తారు.

జోనల్, జాతీయ స్థాయిలో...

జోనల్‌స్థాయిలో విజేతలుగా నిలిచిన ప్రతీ తరగతి నుంచి ఇద్దరు విద్యార్థుల చొప్పున 12 మందిని జాతీయ శిబిరానికి ఎంపిక చేస్తారు. జాతీయస్థాయిలో ప్రతీ తరగతి నుంచి ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థుల చొప్పున 18 మందిని హిమాలయన్స్ విజేతలుగా ప్రకటించి ప్రథమ బహుమతిగా రూ.10 వేలతో పాటు జ్ఞాపిక, ధ్రువీకరణ పత్రం అందజేస్తారు.



రాష్ట్రస్థాయి సైన్స్‌మేళాలో తన ఆవిష్కరణను వివరిస్తున్న విద్యార్థి (ఫైల్)

ఏం చేయాలంటే..

ఆసక్తి కలిగిన విద్యార్థులు www.vvm.org.in అనే వెబ్‌సైట్ ద్వారా రూ.200 ఫీజు చెల్లించి సెప్టెంబర్ 15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రకటించిన తేదీల్లో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషలతో పాటు ఇతర ప్రాంతీయ భాషల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. పాఠశాల జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పరీక్షలు ఉంటాయి. సెప్టెంబర్ 1న నమూనా పరీక్ష, అక్టోబర్ 23, 27 తేదీలలో ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుంది. నవంబర్ 15న ఫలితాలు విడుదల చేస్తారు. డిసెంబర్ 8, 15, 22 తేదీల్లో ఒక్కోరోజు రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయి. 2025 మే 17 లేదా 18 తేదీల్లో జాతీయస్థాయి పరీక్ష ఉంటుంది. అయితే ఈ అంశాలపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో విద్యార్థులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనైనా ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, అధికారులు చొరవ తీసుకోవాలని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షా విధానం ఇలా..

రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు 100 బహుళైచ్చిక ప్రశ్నలతో కూడిన ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు అభ్యసిస్తున్న గణితం, సైన్స్ పాఠ్యపుస్తకాల్లోని అంశాలు 50 శాతం, విజ్ఞాన శాస్త్రం రంగంలో భారతదేశం కృషిపై 20 శాతం, శాస్త్రవేత్తలు వారి జీవిత చరిత్ర అంశాలపై 20 శాతం మార్కులు ఉంటాయి. వీవీఎం వారు వెబ్‌సైట్‌లో అందించే స్టడీ మెటీరియల్ నుంచి సమాచారం సేకరించుకోవచ్చు. ఇక అర్థమెటిక్, లాజికల్ రీజనింగ్‌పై 10 శాతం ప్రశ్నలుంటాయి. ఇవన్నీ కూడా సమకాలిన అంశాలపై కేంద్రీకృతమైన అంశాలతో కూడిన ప్రశ్నలుంటాయి.



రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ హోమ్‌పేజీ

పరిశోధనాభిరుచి పెంపొందుతుంది



పాఠ్యపుస్తకాలతో పాటు సామాజిక, విజ్ఞానశాస్త్ర అంశాలపై పట్టున్న విద్యార్థులు 'విద్యార్థి విజ్ఞాన మంథన్' ద్వారా జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచేందుకు అవకాశం ఉంటుంది. పోటీలు పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండి విజ్ఞాన శాస్త్ర అంశాలపై అభిరుచి కలిగిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా వారిలో పరిశోధనాభిరుచి పెంపొందుతుంది. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులు విద్యార్థులకు సమాచారం అందించాలి.

– డాక్టర్ ఏ.రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

సిరిచెల్మ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న పరిశీలకులు అభినందన్

ఇచ్చోడ: మండలంలోని అతి పురాతన సిరిచెల్మ మల్లన్న ఆలయంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు అభినందన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న విగ్రహాలను పరి శీలించి వాటి ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. ఆలయం చుట్టూ ఉన్న కాకతీయుల కాలం నాడు నిర్మించిన చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో భీంరావు

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారాని కి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఏపీవో కన క భీంరావు అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాల య సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా వాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం శ్యాంనాయక్ తండాకు చెందిన జానాబాయి ఉద్యోగం ఇప్పించాలని, ఇచ్చోడకు చెందిన వంశీ ఆర్థిక సాయం అందించాలని, వేమనపల్లి మండలం గంగనపల్లి గ్రామానికి చెందిన పార్వతి ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగం ఇప్పించాలని, ఇంకా పింఛన్, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ గిరిజనులు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏవో రాంబాబు, హెచ్ఓ సందీప్, జేడీఎం నాగభూషణం, బీఎడ్ ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

లక్ష్మణచాంద: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మత్స్యకారుడు దేశబోయిన పోశెట్టి (53) ఆదివారం రాత్రి చేపలు పట్టేందుకు బ్రాహ్మణ చెరువుకు వెళ్లాడు. చేపలు పట్టేక్రమంలో అతని కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుమలత పంచనామా నిర్వహించి మృతదేహాన్ని నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య సత్తెవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెక్షన్ 194(1) భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

ఖానాపూర్: బైక్ పైనుంచి కిందపడి మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై రాంచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మామడ మండల కేంద్రానికి చెందిన మేకల లక్ష్మి (66) జన్నారం మండలం ఇందన్‌పల్లిలోని బంధువుల ఇంటికి మేనల్లుడు చంద్రయ్యతో కలిసి బైక్‌పై వెళ్లి వస్తుండగా ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బావిలోపడి బాలుడు..

దస్తురాబాద్: వ్యవసాయ బావిలోపడి బాలుడు మృతి చెందిన సంఘటన మల్లాపూర్‌లో చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఎంబడి లావణ్య, మల్లేశ్ దంపతుల రెండో కుమారుడు రాజ్‌కుమార్ (13) ఆదివారం సాయంత్రం తన సోదరితో కలిసి పంటచేనులోని వ్యవసాయ బావి మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. ఈక్రమంలో కాలుజారి బావిలో పడిపోయాడు. వెంటనే అతని సోదరి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో గ్రామస్తులతో కలిసి బావిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. పోలీసులకు సమాచారం అందించడంతో సోమవారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్య

కడెం: అనారోగ్యంతో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నవబ్‌పేట్ గ్రామానికి చెందిన మేడి కావ్య (29) కొంతకాలంగా కడుపునొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 30న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు చిన్నమ్మ మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఇచ్చోడ: మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై జైశ్రీరాం గోశాల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైనట్లు ఎస్సై నరేష్ తెలిపారు. జున్ని గ్రామానికి చెందిన శేషరావు ద్విచక్ర వాహనంపై ఇచ్చోడకు వస్తుండగా గోశాల వద్దకు చేరుకోగానే ఆదిలాబాద్ నుంచి బోథ్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు రిమ్స్‌కు తరలించారు. నూతన చట్టం 125 (బీఎన్ఎస్) ప్రకారం తొలి కేసు నమోదైనట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్‌రూరల్: సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 4 నెలల వేతనాలు ఇవ్వాలని, అన్ని శాఖల మాదిరి ప్రతీ నెల వేతనాలు ఇస్తూ టైం స్కేల్ వర్తింప జేయాలన్నారు. ఈనెల 14 లోగా వేతనాలు విడుదల చేయాలని లేనిపక్షంలో 15 నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు వంశీ, శ్రీనివాస్, వసంత్ కుమార్ పాల్గొనగా డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ముడుగు శామ్యూల్, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, తదితరులు మద్దతు తెలిపారు.

ఐచర్ వాహనం బోల్తా

బేల: మండలంలోని పాటన్ రెవెన్యూ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున టమాట వాహనం బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. కర్ణాటకలోని బెంగళూరు నుంచి మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు వెళ్లే క్రమంలో పాటన్ రెవెన్యూ గ్రామ శివారులోని ఈ 353బి జాతీయ రహదారిపై వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. 100 క్యారెట్ల టమాటలు దెబ్బతినడంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లి ఉంటుందని డ్రైవర్ తెలిపాడు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్ గండి రామన్న శివారులో ఓ గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్సై సాయి కుమార్ తెలిపారు. మృతునికి సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటాయన్నారు. వివరాలు తెలిసిన వారు 87126 59515, 8712659514 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రోడ్డు, వంతెన పనులు ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

ఉట్నూర్‌రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మండలంలోని రామలింగంపేట్ నుంచి శ్యాంనాయక్‌తండా వరకు రూ.3.75 కోట్లతో చేపట్టిన తారురోడ్డు, వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించడం వల్ల అభివృద్ధి చెందుతుందన్నారు. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, కాంగ్రెస్ నాయకురాలు సుగుణ, జెడ్పీటీసీ చారులత రాథోడ్, ఈఈ భీంరావు, అధికారులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న గ్రామీణ పేదల సంఘం నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. అంతకుముందు మండలంలో ర్యాలీ నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్ మాట్లాడుతూ గిరిజనులు సాగుచేస్తున్న పోడుభూముల్లో ఫారెస్ట్ అధికారులు బలవంతంగా కందకాలు తవ్వ డం నిలిపివేయాలన్నారు. భూమిలేని పేద కుటుంబాలకు మూడెకరాల భూమి పంపిణీ చేయాలని, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏ ఏపీవో భీంరావుకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సిడాం ధర్ము, ఎనుముల నర్సయ్య, ఎల్లయ్య, చంద్రయ్య, సంధ్య, వనిత, గిరిజనులు పాల్గొన్నారు.